సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం। 25। జూన్। 2023



వరి సాగుకు ఇవి మేలు

చౌడు భూముల్లో సైతం వరి సాగుకు ఎంటీయూ 1,293, ఎంటీఎం 106 వంగడాలు అనువుగా ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. 8లో ▸



వర్జీనియా ధర పైపైకి..

వర్జీనియా పొగాకు ధర సరికొత్త రికార్డును సృష్టించింది. శనివారం కిలోకు అత్యధికంగా రూ.288 ధర పలికి ఔరా అనిపించింది. 8లో ▸

పోటెత్తిన భక్తులు

ద్వారకాతిరుమల చినవెంకన్న దివ్య క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలోని అన్ని విభాగాలు కిటకిటలాడాయి. 8లో ▸



న్యూస్‌రీల్

ఎస్సీ రైతులకు శిక్షణ



రైతులకు విత్తనాలు అందిస్తున్న అధికారులు

నరసాపురం రూరల్: నరసాపుం డివిజన్ పరిధిలో ఎస్సీ కేటగిరీకి చెందిన 30 మంది రైతులను ఎంపిక చేసి 14 వారాలపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం నవరసపురంలో నిర్వహించిన పొలం బడి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పొలంలో పురుగు మందుల పిచికారీ, విత్తన శుద్ధి, పచ్చిరొట్ట పైర్ల పెంపకం, భూసార పరీక్షలు, ఎరువుల వాడకంపై సూచనలు ఇచ్చారు. నవరసపురం గ్రామాన్ని పొలం బడి ద్వారా దత్తత తీసుకుని 30 మంది ఎస్సీ రైతులకు ఉచితంగా ఎంటీయూ 1061 విత్తనాలను పంపిణీ చేశారు. కేవీకే కో-ఆర్డినేటర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ వరిసాగు చేసే రైతులు టెక్నాలజీని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలన్నారు. చేపల రైతులకు కూడా శిక్షణ కొనసాగిస్తామన్నారు. జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ ఈదా అనిల్ కుమారి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కాండ్రేగుల నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐపీఈటీ ప్రవేశాలకు గడువు పెంపు

పాలకొల్లు సెంట్రల్: సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సీఐపీఈటీ) డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 30 వరకు గడువు పెంచినట్టు సీఐపీఈటీ జాయింట్ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ శనివారం తెలిపారు. డిప్లమో (మూడేళ్లు), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో (రెండేళ్లు) కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. డిప్లమో ఇన్ ప్లాస్టిక్ టెక్నాలజీ, డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సులకు 10వ తరగతి, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుకు బీఎస్సీ విద్యార్హత అని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని, మరిన్ని వివరాలకు కె.సుందరావు, సెల్ 9398052055 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డీఈఎల్ఈడీ ఫీజు చెల్లించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వచ్చేనెల 6వ తేదీలోపు పరీక్ష ఫీజులు చెల్లించాలని ఏలూరు డీఈఓ ఎన్‌వీ రవిసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో వచ్చేనెల 13 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి ఈనెల 26 నుంచి అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సాధారణ అభ్యర్థులు పరీక్ష రుసుం రూ.250 వెబ్ అప్లికేషన్ ఫారం నింపే సమయంలో కనిపించే పేమెంట్ గేట్‌వే ద్వారా రెగ్యులర్, ప్రైవేట్ అభ్యర్థులకు వేర్వేరుగా ఫీజు చెల్లించాలని తెలిపారు. ప్రైవేట్, రెగ్యులర్ అభ్యర్థులు 4 నుంచి 6 సబ్జెక్టులకు రూ.250, 3 సబ్జెక్టులకు రూ.175, 2 సబ్జెక్టులకు రూ.150, ఒక సబ్జెక్టుకు రూ.125 చెల్లించాలని పేర్కొన్నారు.

3 నుంచి టీసీసీ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలను వచ్చేనెల 3 నుంచి నిర్వహించనున్నట్టు ఏలూరు డీఈఓ ఎన్‌వీ రవిసాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ వరకూ డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సుల్లో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను బీఎస్ఈఏపీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని, పరీక్షలకు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ ఫొటో గుర్తింపు కార్డు (పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్) తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

తీరం.. వైద్య సమీరం

- రూ.47 కోట్లతో ఆస్పత్రుల నిర్మాణాలు
- నరసాపురంలో 100 పడకల హాస్పిటల్
- కొత్తగా రెండు పీహెచ్‌సీలు
- 45 విలేజ్ క్లినిక్‌లు
- నాడు-నేడుతో ఆరోగ్య విప్లవం



నరసాపురంలో 100 పడకల ఏరియా ఆస్పత్రి, (ఇన్‌సెట్‌లో) కమ్యూనిటీ హెల్త్ సెంటర్

నరసాపురం: జిల్లాలోని తీర ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగా ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టింది. అలాగే 19 కిలోమీటర్ల మేర ఉన్న తీర ప్రాంతంలో పేదలకు ఉన్నత వైద్యం అందించేలా ఆస్పత్రుల నిర్మాణాలు, మరమ్మతులు, వసతుల కల్పనకు రూ.47 కోట్లు వెచ్చించింది. ప్రధానంగా నరసాపురంలో 50 పడకలుగా ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను రూ.13 కోట్లతో 100 పడకల ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేశారు. అలాగే నరసాపురం నియోజకవర్గంలో కొత్తగా రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 45 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేశారు. నాడు-నేడులో భాగంగా ప్రభుత్వం సర్కారీ ఆస్పత్రుల రూపురేఖలు మారుస్తోంది. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ప్రత్యేక పర్యవేక్షణలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

ఆస్పత్రి సేవలకు 'వంద'నం

నరసాపురంలోని రుస్తుంబాదలో 50 పడకలతో ఉన్న సీహెచ్‌సీని 100 పడకల ఏరియా ఆస్పత్రిగా కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు. గత నవంబర్‌లో సీఎం జగన్ ఆస్పత్రిని లాంఛనంగా ప్రారంభించగా.. తాజాగా ఆస్పత్రిలో సేవలు ప్రారంభమయ్యాయి. రూ.13 కోట్ల నిధులతో రెండేళ్లలో ఆస్పత్రి అభివృద్ధి పనులు పూర్తిచేయడం విశేషం. ఆస్పత్రిలో అధునాతన వసతులు ఏర్పాటుచేశారు. స్కానింగ్ యూనిట్, బ్లడ్ స్టోరేజ్ యూనిట్ నెలకొల్పారు. రిహేబిటేషన్ సెంటర్, కిడ్నీ డయాలసిస్ సెంటర్ వంటి అదనపు సౌకర్యాలు కల్పించనున్నారు. సుమారు 3 లక్షలకు పైగా జనాభాకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఆస్పత్రుల ఆధునికీకరణ

నరసాపురంలో రెండు పీహెచ్‌సీలు ఉండగా అదనంగా మరొకటి, మొగల్తూరు మండలంలోని కాళీపట్నంలో మరో పీహెచ్‌సీని నిర్మించారు. వీటి కోసం రూ.5 కోట్లు వెచ్చించారు. అలాగే నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని 45 గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటుచేశారు. ఒక్కో క్లినిక్‌కు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు వెచ్చించారు. దీంతోపాటు పాత ఎల్‌బీచర్ల, తూర్పుతాళ్లు, మొగల్తూరు పీహెచ్‌సీలను రూ.1.50 కోట్లతో ఆధునికీకరించి వైద్య సేవలను మెరుగుపర్చారు.

గతంలో బోర్డుతో సరిపెట్టి..

గత టీడీపీ హయాంలో ఆస్పత్రిని ఏమాత్రం పట్టించుకోకపోగా కనీసం వైద్యుల పోస్టులు కూడా భర్తీ చేయలేదు. దీంతో వైద్య సేవలు అరకొరగా అందేవి. అప్పట్లో పాత ఆస్పత్రి భవనం వద్ద ఏరియా ఆస్పత్రి అని బోర్డు పెట్టి చేతులు దులుపుకున్నారు. ఈ నేపథ్యంలో 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆస్పత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించారు.

ఆస్పత్రులు	ఖర్చు
100 పడకల ఏరియా ఆస్పత్రి	రూ.13 కోట్లు
2 పీహెచ్‌సీలు	రూ.5 కోట్లు
45 విలేజ్ క్లినిక్‌లు	రూ.23 కోట్లు
వసతుల కల్పన	రూ.6 కోట్లు
మొత్తం	రూ.47 కోట్లు

వైద్యానికి పెద్దపీట



సీఎం జగన్ పేదల వైద్యానికి పెద్దపీట వేస్తున్నారు. వ్యాధులతో పేద, మధ్యతరగతి వర్గాలు అప్పులు పాలు కాకూడదని కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. నరసాపురం నియోజకవర్గంలో నాలుగేళ్లలో ఆస్పత్రుల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు రూ.47 కోట్లు ఖర్చు చేశారు.
– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

ఇబ్బందులు తీరాయి



గతంలో ప్రభుత్వాస్పత్రికి వెళితే ఉన్నత వైద్యానికి ఏలూరు, కాకినాడ సిఫార్సు చేసేవారు. నరసాపురంలో 100 పడకల ఆస్పత్రి నిర్మించడంతో మా కష్టాలు తీరాయి. కార్పొరేట్ హాస్పటల్‌ను తలదన్నేలా అధునాతన సౌకర్యాలతో దీనిని నిర్మించారు. అన్నిరకాల పరీక్షలు చేస్తున్నారు.
– గ్రంధి బాబీ, మొగల్తూరు

చాలా గొప్పగా కట్టారు



నరసాపురంలో 100 పడకల ఆస్పత్రిని చాలా గొప్పగా కట్టారు. ఐదేళ్ల క్రితం ఓ వ్యక్తి ప్రమాదానికి గురై ఆస్పత్రికి తీసుకువెళితే పరిస్థితి విషమంగా ఉందని ఏలూరు పంపారు. అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉండదు. ఇక్కడే అన్ని సౌకర్యాలు కల్పించారు.
– ముద్దాల పద్మ, లక్ష్మణేశ్వరం

26 నుంచి కుష్ఠు నిర్మూలన కార్యక్రమం

జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణ వేణి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డీఆర్వో కృష్ణవేణి

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని జిల్లాలో ఈనెల 26 నుంచి వచ్చేనెల 16 వరకు నిర్వహించనున్నామని జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. భీమవరం కలెక్టరేట్‌లో వైద్యాశాఖ ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి నిర్ధారణ, అవగాహన కార్యక్రమ పోస్టర్లను శనివారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఆర్వో కృష్ణవేణి మాట్లాడుతూ ఇంటింటా సర్వే చేస్తారని, కుష్ఠు నిర్ధారణపై స్వీయ పరీక్ష చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి, స్క్రీనింగ్ నిర్వహణ చేపడతారన్నారు. కుష్ఠురహిత సమాజానికి అందరూ కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు చేసి ఎండీటీ మందులు అందిస్తారన్నారు. కుష్ఠును ప్రారంభ దశలో గుర్తిస్తే అంగ వైకల్యాన్ని నివారించవచ్చన్నారు. కుష్ఠు అంటువ్యాధి కాదని, క్రమం తప్పకుండా మందులు వాడితే నివారించవచ్చని అన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగి రంగు మచ్చలు ఉంటే అప్రమత్తం కావాలని ప్రజలకు సూచించారు. జిల్లా అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ డి.భానునాయక్, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ విఘ్నేష్, డీఎస్ఎంఓ జేవీ రామన్, పీఎంఓలు కేవీ శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ, జిల్లా పంచాయతీ కార్యాలయ ఏఓ టి.రామకృష్ణ, రెడ్‌క్రాస్ సీనియర్ కో-ఆర్డినేటర్ ఎస్.మల్లేశ్వరరావు, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యాపారంపై కొరడా



భీమవరం నారాయణ స్కూల్‌లో గదిని సీజ్ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా విద్యా సామగ్రి విక్రయాలపై విద్యాశాఖ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేయాలని డీఈఓ ఆర్.వెంకటరమణ అధికారులను ఇప్పటికే ఆదేశించారు. భీమవరం నారాయణ స్కూల్‌లో పుస్తకాలు, విద్యా సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తున్నారని శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేపట్టారు. దీంతో భీమవరం డీవైఈఓ డి.శ్రీరామ్ స్కూల్‌లో తనిఖీలు చేశారు. పుస్తకాలు, విద్యా సామగ్రి గదిని సీజ్ చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు. అధిక ధరలకు పుస్తకాలు, విద్యా సామగ్రి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గూడెంలో అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో సాగుతున్న పుస్తకాల అమ్మకాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకున్నారు. పలు కార్పొరేట్ స్కూళ్లలో అధిక ధరలకు పుస్తకాలు అమ్ముతున్నారని తెలియడంతో ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. దీనిపై మండల విద్యాశాఖాధికారికి సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు విద్యాశాఖ సిబ్బంది తనిఖీలు చేసి ఓ స్కూల్‌లో పుస్తకాల గదిని సీజ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలను వ్యాపార కేంద్రాలుగా మార్చుతున్నారని మండిపడ్డారు.

పెనుగొండ చైతన్య పాఠశాలలో..

పెనుగొండ: పెనుగొండలోని చైతన్య పాఠశాలలో అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్నారని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేశారు. దీనిపై స్పందించిన విద్యాశాఖ అధికారులు పాఠశాలను తనిఖీ చేసి పుస్తకాల అమ్మకాలను నిలిపివేసి, విద్యా సామగ్రి గదికి సీలు వేశారు.

విద్యుత్ డిప్యూటీ ఈఈల బదిలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న పలువురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను బదిలీ చేస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నిడదవోలు కనస్ట్రక్షన్స్ విభాగంలో పనిచేస్తున్న వి.సునీతను విజయవాడ ఎల్ఎంసీ/ఎస్ఎల్‌డీసీకి బదిలీ చేశారు. విజయవాడ ఎల్ఎంసీ/ఎస్ఎల్‌డీసీలో పనిచేస్తున్న యు.సూర్యకళను తాడేపల్లిగూడెం హెచ్‌టీ మీటర్స్-2కు, ఏలూరు డీపీఈ-1లో పనిచేస్తున్న ఎం.రమాదేవిని వట్లూరు స్టోర్స్‌కు బదిలీ చేశారు. అలాగే వట్లూరు స్టోర్స్‌లో పనిచేస్తున్న కె.రమేష్‌ను ఏలూరు ఎస్పీఎం విభాగానికి, ఏలూరు ఎస్పీఎంలో పనిచేస్తున్న ఎం.రత్నప్రకాష్‌ను ఏలూరు డీపీఈ-1కు, విజయవాడ ఏపీపీసీసీలో పనిచేస్తున్న చైతన్యవర్మను నిడదవోలు కనస్ట్రక్షన్స్‌కు, భీమవరం డీపీఈ-2లో పనిచేస్తున్న యు.శ్రీనివాసరావును జంగారెడ్డిగూడెం కనస్ట్రక్షన్స్‌కు బదిలీచేసి ఆయన సేవలను సీఎండీ పేషీలో వినియోగించుకునేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని నరసాపురం, నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను మరో రెండు రోజుల్లో బదిలీ చేసే అవకాశం ఉందని విద్యుత్ ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది.

సుపరిపాలనకే 'సురక్ష'

జగనన్న సురక్ష.. పేదలకు రక్ష

- జిల్లాలో ఇంటింటా సర్వే
- 50 సచివాలయాల పరిధిలో ప్రారంభం
- తొలిరోజు 4,914 కుటుంబాల వివరాల సేకరణ
- ఉచితంగా 11 రకాల సర్వీసులు



తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లిలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్రంలో అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారుంటే గుర్తించి వారికి లబ్ధి చేకూర్చడంతో పాటు 11 రకాల సేవలను ఉచితంగా అందించేలా రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలో శుక్రవారం లాంఛనంగా ప్రారంభం కాగా.. శనివారం ఇంటింటా సర్వే ప్రారంభమైంది. తొలిరోజు జిల్లాలోని 50 సచివాలయాల పరిధిలో మొత్తం 4,914 కుటుంబాలను సర్వే చేశారు. జిల్లాలోని 6.40 లక్షల కుటుంబాల వివరాలు సేకరించనున్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు సర్వేలో పాల్గొంటున్నారు. నెలాఖరు వరకు సర్వే చేస్తారు.

1 నుంచి ప్రత్యేక శిబిరాలు

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 1 నుంచి ప్రతి సచివాలయం వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తారు. వీటి నిర్వహణకు తహసీల్దార్, ఈవోపీఆర్డీ ఒక బృందంగా, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీఓ మరో బృందంగా టీమ్‌లు ఏర్పాటుచేశారు. అలాగే మున్సిపాలిటీలో కమిషనర్, సిబ్బంది ఒక బృందంగా, అసిస్టెంట్ కమిషనర్, సిబ్బంది మరో బృందంగా క్యాంపులను నిర్వహిస్తారు. ప్రత్యేక బృందాలు సచివాలయాల వద్ద రోజంతా ఉండి పథకాల సమస్యలు పరిష్కరించడంతో పాటు ఆయా ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. నెల రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అలాగే పథకాల అర్హులకు ఆగస్టు 1 నుంచి పథకాల లబ్ధిని అందిస్తారు.

ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు

జనన, మరణ, కుల, ఆదాయ, వివాహ ధ్రువీకరణ పత్రాల జారీ, మ్యుటేషన్లు, ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం, సీసీఆర్ కార్డులు, కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, ప్రభుత్వ డేటాకు సంబంధించిన మార్పులు, చేర్పులు, హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ విభజన వంటి మొత్తం 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తారు.

పర్యవేక్షణకు బృందాలు

సురక్ష పర్యవేక్షణకు జిల్లా, నియోజకవర్గం, మండలానికి ప్రత్యేక అధికారులతో మూడు రకాల బృందాలను ఏర్పాటుచేశారు. జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్‌లో 9 మంది, నియోజకవర్గ బృందంలో 7గురు, మండల బృందంలో 26 మంది ఉన్నారు. వీరితో పాటు కలెక్టర్ వారానికి రెండు, జాయింట్ కలెక్టర్ వారానికి నాలుగు సచివాలయాలను సందర్శిస్తారు.

50 బృందాలు

జిల్లాలో గ్రామ సచివాలయాలు 403, వార్డు సచివాలయాలు 132 ఉన్నాయి. మొత్తం 20 మండలాలకు సంబంధించి 40 బృందాలు, మున్సిపాలిటీలకు సంబంధించి 10 బృందాలను సిద్ధం చేశారు.

అర్హులందరికీ లబ్ధి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్/పెంటపాడు/తాడేపల్లిగూడెం అర్బన్: అర్హత కలిగి ఉండి సంక్షేమ పథకాలు అందని వారందరికీ నూరుశాతం మేలు చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి, పెంటపాడు మండలం అలంపురం, తాడేపల్లిగూడెంలోని 1,2,3 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యకర వాతావరణంలో కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. ఇప్పటివరకూ ఒకే కార్డులో తల్లీకుమార్తెలు పింఛన్లు పొందేందుకు అర్హులు కాదని, ఇకపై స్లిపట్ విధానంలో తల్లీకూతుళ్లను వేరు చేసి పింఛన్ లబ్ధి చేకూరుస్తామన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ల కోసం రూ.380 కోట్లు ఖర్చు చేస్తే.. సీఎం జగన్ ప్రభుత్వంలో ప్రతినెలా 64 లక్షల మందికి రూ.1,600 కోట్లను అందిస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలకు లంచాలు ఇచ్చే పరిస్థితి ఉండేదని, ఇందుకు భిన్నంగా తాము పారదర్శకంగా పథకాలు అమలు చేస్తున్నామన్నారు. సీఎం జగన్ నిజాయతీతో పాలన అందిస్తుంటే బురద జల్లేందుకు టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా కుట్రలు చేస్తోందని మండిపడ్డారు.

విజయవంతానికి చర్యలు



జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతానికి చర్యలు తీసుకున్నాం. దీనిపై ఇప్పటికే అధికారులు, ప్రత్యేక బృందాలకు అవగాహన కల్పించాం. ఇంటింటా సర్వే ప్రారంభమైంది. అర్హత కలిగి పథకాలు పొందలేని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– పి.ప్రశాంతి కలెక్టర్

క్లుప్తంగా

దిశకు ఫోన్ కాల్‌తో బాధితురాలికి రక్షణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): భార్యాభర్తల మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరగగా, దిక్కుతోచని స్థితిలో ఓ బాధితురాలు దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసి సహాయం కోరగా వెంటనే పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి ఆమెకు రక్షణ కల్పించారు. పోలీసులు శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెంటపాడు మండలం పరిమళ్లకు చెందిన అచ్చయ్యతో దేవకుమారికి కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల అచ్చయ్య మరో మహిళతో భర్త వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు భార్యకు తెలిసింది. ఈ క్రమంలో భర్త అచ్చయ్య, మరో మహిళతో తాడేపల్లిగూడెంలోని ఓ ఇంట్లో ఉండగా భార్య వెళ్లి రెడ్ హ్యాండెడ్‌గా భర్తను పట్టుకుని నిలదీసింది. దీంతో భార్యభర్తల మధ్య వివాదం తలెత్తగా భయాందోళనకు గురైన భార్య దేవకుమారి దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. పోలీసులు లొకేషన్‌కు చేరుకుని వివరాలను నమోదు చేశారు. గత మే నెలలో బాధిత మహిళ తన భర్త అచ్చయ్యపై పెంటపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అచ్చయ్యపై ఐపీసీ 498 ఏ కింద కేసు నమోదైనట్లు గుర్తించారు. అదే విధంగా భార్యాభర్తలకు దిశ టీం కౌన్సెలింగ్ ఇచ్చింది.

వ్యక్తి అదృశ్యంపై కేసు

పెంటపాడు: ప్రత్తిపాడులో ఒక వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై జి.సత్యనారాయణ శనివారం చెప్పారు. గ్రామానికి చెందిన 39 ఏళ్ల వయస్సున్న రైతు వీర్ల కాశీవిశ్వేశ్వరరావు ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో శనివారం పెంటపాడు పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నాలుగేళ్లలో రూ.2.16 లక్షల కోట్ల లబ్ధి

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- చినతాడేపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం



చినతాడేపల్లిలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్ : రాష్ట్రంలో 1.60 కోట్ల కుటుంబాలకు గత నాలుగేళ్ల కాలంలో రూ.2.16 లక్షల కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం నేరుగా జమ చేయడం జరిగిందని, మరో ఏడాది కాలంలో రూ.55 వేల కోట్లను అందించనున్నామని, వెరసి రూ.2.70 లక్షల కోట్ల లబ్ధి చేకూర్చడం జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం చినతాడేపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పరోక్షంగా రాష్ట్రంలో 32 లక్షల మంది మహిళలకు ఇళ్ల స్థలాల రూపంలో రూ.1.20 లక్షల కోట్ల ఆస్తిని అందించినట్టు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం 168 శాతం అంటే రూ.2.60 లక్షల కోట్ల అప్పులు చేసిందన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం కేవలం 58 శాతం అప్పులతోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇవి 2021-22లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించిన గణాంకాలేనని వివరించారు. పరిమితికి లోబడే ప్రభుత్వం అప్పులు చేసినట్టు చెప్పారు. చంద్రబాబు అండ్ కో పరిమితికి మించి అప్పులు చేసి, ఆ డబ్బులు దోచేశారన్నారు. నాడు రైతు, డ్వాక్రా మహిళల రుణమాఫీ, నిరుద్యోగ యువతకు భృతి ఇస్తామని నమ్మబలికి మోసం చేశారని గుర్తుచేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇప్పుడు కొత్త అవతారం ఎత్తాడని విమర్శించారు.

నువ్వెలా హామీలిస్తున్నావు బాబూ..

రాజమహేంద్రవరం వేదికగా నిర్వహించిన టీడీపీ మహానాడులో ఇంట్లో ఎంతమంది చదువుకుంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేలు, 18 ఏళ్లు నిండిన వారికి ప్రతి నెలా రూ.15 వేలు, బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణ సౌలభ్యం, రైతులకు ఏడాదికి రూ.20 వేలు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశాడని చెప్పారు. పథకాల పేరిట సొమ్ములిస్తూ ప్రజల్ని సోమరిపోతులను చేస్తున్నారన్న చంద్రబాబు.. ఈ హామీలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన ఏ హామీనైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. పిట్టలదొర మాదిరిగా చంద్రబాబు మాటలు ఉన్నాయన్నారు.

ముద్రగడ సవాల్‌ను స్వీకరిస్తావా పవన్

తాడేపల్లిగూడెం అర్బన్: కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం ఎన్నికల్లో పోటీపై చేసిన సవాల్‌ను స్వీకరిస్తావా అని జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. తాడేపల్లిగూడెంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పవన్‌కల్యాణ్ కాకినాడ నుంచి పోటీ చేసినా, పిఠాపురం నుంచి పోటీ చేసినా తాను పోటీకి సిద్ధమని ముద్రగడ పద్మనాభం ప్రకటించారని గుర్తుచేశారు. ఈ సవాల్‌ను పవన్ స్పందించాలన్నారు. చంద్రబాబు వద్ద కిరాయి మనిషిగా పనిచేస్తూ కాపు జాతిని తాకట్టు పెట్టడానికి ఎవడు అధికారం ఇచ్చాడని మంత్రి ఈ సందర్భంగా మండిపడ్డారు.

డిగ్రీ ఆనర్స్‌తో సబ్జెక్టుపై పూర్తి పట్టు



వర్సిటీ డీన్ రమేష్‌ను సత్కరిస్తున్న సీఆర్‌ఆర్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ హానర్స్‌లో మేజర్ సింగిల్ సబ్జెక్టు విధానం అమలులోకి వచ్చిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ కేఎస్ రమేష్ చెప్పారు. జాతీయ విద్యా విధానం 2020 అమలులో భాగంగా 2023-24 విద్యా సంవత్సరం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన డిగ్రీ హానర్స్ కోర్సుల ప్రవేశాల్లో చోటుచేసుకున్న మార్పులపై శనివారం స్థానిక సీఆర్‌ఆర్ అటానమస్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిగ్రీ హానర్స్‌లో విద్యార్థి తనకు ఇష్టమైన సబ్జెక్టును నాలుగు సంవత్సరాలు చదువుతాడని, తద్వారా ఆ సబ్జెక్టుపై పూర్తి అవగాహన, పరిజ్ఞానం, పట్టు సాధించి సంబంధిత రంగాల్లో నిష్ణాతుడు కావడానికి దోహద పడుతుందన్నారు. అలాగే మేజర్ సబ్జెక్టుతో పాటు మైనర్ సబ్జెక్టుగా తనకు ఇష్టమైన సబ్జెక్టును ఉంచుకుని చదివే అవకాశాన్ని ఈ విద్యా విధానం కల్పిస్తుందన్నారు. ఈ విధానంలో హానర్స్ డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తి చేస్తే ప్రిడిప్లొమా సర్టిఫికెట్, రెండేళ్లు పూర్తి చేస్తే డిప్లొమా సర్టిఫికెట్, మూడేళ్లు పూర్తి చేస్తే డిగ్రీ సర్టిఫికెట్, నాలుగు సంవత్సరాలు పూర్తి చేసిన విద్యార్థులకు డిగ్రీ హానర్స్ సర్టిఫికెట్ ఇస్తారని తెలిపారు. పూర్వం డిగ్రీ చదువు మధ్యలో ఆపేసిన వారికి కేవలం ఇంటర్మీడియట్ అర్హత మాత్రమే ఉండేదని, కానీ నూతన విద్యా విధానంలో విద్యార్థి డిగ్రీలో ఏ సంవత్సరంలో మానివేసినా తప్పనిసరిగా సర్టిఫికెట్ వస్తుందని స్పష్టం చేశారు. ఈ అవగాహన సదస్సులో సీఆర్‌ఆర్ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ప్రిన్స్‌పాల్ కేఏ రామరాజు, మహిళా కళాశాల ప్రిన్స్‌పాల్ కె.శైలజ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ జీ. గిరిబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథి కేఎస్ రమేష్‌ను కళాశాల యాజమాన్య ప్రతినిధులు సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

చౌడు నేలల్లో వరి సాగుకు ఇవి మేలు

ఉండి: చౌడు భూముల్లో సైతం వరి సాగుకు ఎంటీయూ 1,293, ఎంటీఎం 106 వరి వంగడాలు అనువుగా ఉండటమే కాక అధిక దిగుబడులను ఇస్తాయని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ పీ వినయలక్ష్మి, కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్టేరు వరి పరిశోధానా కేంద్రం నుంచి 2022లో విడుదలైన ఎంటీయూ 1,293 రకం వరి వంగడం చౌడు నేలలను తట్టుకుని 120 నుంచి 122 రోజుల్లోనే పంట చేతికొస్తుందన్నారు. ఈ రకం హెక్టారుకు 6 టన్నులు, సాధారణ నేలల్లో 4 టన్నుల వరకు దిగుబడులు వస్తాయన్నారు. సన్నగింజ రకానికి చెందిన ఈ రకం నాణ్యతగా ఉంటుందని, పొట్టకుళ్లు, టుంగ్రో వైరస్, అగ్గితెగులు, గోధుమరంగు తెగుళ్లను మధ్యస్థంగా తట్టుకుంటుందన్నారు. జీవసాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఎంటీయూ 1010, ఎఫ్ఎల్ 478 రకాల నుంచి క్రాసింగ్ ద్వారా తయారు చేయబడిన ఈ రకం పైరు పడిపోదని, చేనులో గింజ రాలదన్నారు. అలాగే వ్యవసాయ పరిశోధనా స్థానం మచిలీపట్నం నుంచి కూడా 2022లో ఎంసీఎం 106 అనే వరి వంగడాన్ని కూడా విడుదల చేశారని, ఇది కూడా చౌడు భూముల్లో మంచి దిగుబడులు ఇస్తుందన్నారు. ఈ రకం హెక్టారుకు 6 టన్నులు, సాధారణ నేలల్లో 5 నుంచి 5.50 టన్నుల దిగుబడి ఇస్తుందన్నారు. ఈ గింజ కూడా సన్నరకానికి చెందినదేనన్నారు. దీనిపంట కాలం 140 రోజులు ఉంటుందని, సాగులో 90:60:60 నత్రజని, భాస్వరం, పొటాష్ హెక్టారుకు కేజీ చొప్పున వాడితే చేను పడిపోకుండా ఉంటుందన్నారు. ఈ కరం కూడా అగ్గితెగులు, పొడ తెగులు, తెల్లదోమను కొంత వరకు తట్టుకుంటుందని శాస్త్రవేత్త విజయలక్ష్మీ వివరించారు. రైతులు చౌడు నేలల్లో సాధారణ వరి వంగడాలను సాగు చేసి నష్టపోకుండా శాస్త్రవేత్తలు సూచించిన ఎంటీయూ 1293, ఎంసీఎం 106 రకాలను సాగు చేసి లబ్ధి పొందాలని కోరారు.

వర్జీనియా ధర మరింత పైపైకి



కొయ్యలగూడెం వేలం కేంద్రంలో వేలానికి వచ్చిన బేళ్లు

జంగారెడ్డిగూడెం: వర్జీనియా ధర కొత్త రికార్డులను సృష్టిస్తూ దూసుకుపోతోంది. శుక్రవారం నాటి ధరే అత్యధికం అనుకుంటే, శనివారం మరో రికార్డు నమోదైంది. కేజీ ఒక్కింటికి రూ. 288 నమోదై అశ్చర్య చకితులను చేసింది. వ్యాపారులు సైతం పోటాపోటీగా కొనుగోళ్లు చేస్తుండటంతో ధరలు పైపైకి ఎగబాకుతూ వర్జీనియా ధరల ర్యాలీ కొనసాగుతోంది. శనివారం ఎస్ఎల్ఎస్ ఏరియా పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో రూ.286 నుంచి 288 మధ్య గరిష్ట ధర నమోదైంది. జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-2లో కేజీ ఒక్కింటికి రూ.288 ధర లభించగా, దేవరపల్లి, జంగారెడ్డిగూడెం-1, కొయ్యలగూడెం వేలం కేంద్రాల్లో రూ.287, గోపాలపురం వేలం కేంద్రంలో రూ.286 ధర నమోదైంది. కాగా, దేవరపల్లి వేలం కేంద్రానికి 1639 బేళ్లు రాగా, 1536, జంగారెడ్డిగూడెం-1కు 1527 బేళ్లు రాగా, 1487, జంగారెడ్డిగూడెం-2కు 1317 బేళ్లు రాగా, 1261, కొయ్యలగూడెంకు 1614 బేళ్లు రాగా, 1519, గోపాలపురం వేలం కేంద్రానికి 1010 బేళ్లు రాగా, 965 బేళ్లు రైతుల నుంచి కొనుగోలు చేశారు.

గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం 22వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

గంజాయి తరలిస్తున్న ఐదుగురి అరెస్టు

పాలకోడేరు: గరగపర్రు గ్రామంలో గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరగపర్రులో శనివారం వాహన తనిఖీలు చేస్తుండగా తాడేపల్లిగూడెం నుంచి భీమవరం వైపు వెళుతున్న కారును ఆపి తనిఖీ చేస్తుండగా, అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని వాహనాన్ని తనిఖీ చేసి అందులో ఉన్న 25.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కాగా గంజాయి తరలిస్తున్న గుంటూరు జిల్లాకు చెందిన సీహెచ్ సురేష్, పి.ఉమామహేశ్వరరావు, పి.కిరణ్ బాబు, డి.పూర్ణచంద్రరావు, బి.సత్యస్వరూపపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సీఐ నాగ ప్రసాద్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

శాశ్వత లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న మేరి గ్రేస్‌కుమారి

ఏలూరు (టూటౌన్): ప్రజాప్రయోజిత న్యాయసేవల శాశ్వత లోక్‌అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ ఎ.మేరి గ్రేస్‌కుమారి అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో శనివారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రవాణా, పోస్టల్, ఇన్సూరెన్స్, వైద్య, విద్య, బ్యాంకింగ్, ఎన్ఆర్ఈజీఎస్, హౌసింగ్, రియల్‌ఎస్టేట్, పారిశుద్ధ్యం తదితర సేవల్లో ప్రజలకు లోపం జరిగినప్పుడు న్యాయం కోసం శాశ్వత లోక్‌అదాలత్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో అన్ని సేవలు ఉచితంగా అందిస్తామని, దీనిపై అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రెవెన్యూ, ఏఆర్ఈజీఎస్, టెలికం, డీఎంఅండ్‌హెచ్ఓ, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

బాలిక అపహరణ కేసులో ముగ్గురికి రిమాండ్

భీమడోలు : బాలిక అపహరణ కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎం పురానికి చెందిన ఖండవల్లి అంబేడ్కర్ అనే యువకుడు అదే గ్రామంలోని ఓ బాలికను ప్రేమ పేరుతో వెంటపడి వేధిస్తున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు మూడు నెలల క్రితం అతడిని మందలించగా ఇంకెన్నాడూ బాలిక జోలికి రానని చెప్పి కేసు పెట్టకుండా జాగ్రత్త పడ్డాడు. అయితే అంబేడ్కర్ ఈనెల 21న తన సన్నిహితులైన బిరుదుగడ్డ నరేష్, వెంకటేశ్వరరావు సహకారంతో బాలికను ఆమె ఇంటి నుంచి రాజమండ్రి తీసుకువెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా ఎస్సై సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితును అరెస్ట్ చేశారు.

నదుల పరిరక్షణ అందరి బాధ్యత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దేశంలో నదులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పౌరులైన ప్రతి ఒక్కరిపై ఉందని చాత్రాజుల విజయగోపాలకృష్ణ అన్నారు. దేశంలో నదుల పరిరక్షణ, నదీ జలాల పరిశుభ్రత తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, అవగాహన కల్పించడం కోసం కర్ణాటక రాష్ట్రం సింధనూరులో స్థిరపడిన జిల్లా వాసి గోపాలకృష్ణ 2022 మార్చి 11 నుంచి దేశవ్యాప్త సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర శనివారం ఏలూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను సింధనూరులో యాత్ర ప్రారంభించి శనివారం నాటికి 469 రోజులైందన్నారు. ఈ యాత్ర 500 రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. తన యాత్ర ఇప్పటికి దేశంలోని 15 రాష్ట్రాల మీదుగా కొనసాగిందని, ఆయా ప్రాంతాల్లోని గంగ, యమున, సరస్వతి, గోదావరి, కృష్ణ, నర్మద, సింధు, తుంగభద్ర తదితర నదీ పరివాహక ప్రాంతాలను సందర్శించి ఆయా ప్రాంతాల్లో ప్రజల్లో అవగాహన కల్పించడానికి కృషి చేశానన్నారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తమామలపై కేసు

ఉండి: అదనపు కట్నం కోసం వివాహితను వేధిస్తున్న భర్త, అత్తమామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. మహదేవపట్నం గ్రామానికి చెందిన చింతా శివగంగాదేవి, నాగవరప్రసాద్‌కు 16 ఏళ్ళ క్రితం వివాహమైంది. గత కొంతకాలం నుంచి శివగంగాదేవిని అదనపు కట్నం తీసుకురావాలంటూ భర్త, అత్తమామలు ఆమెను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ వేధింపులు భరించలేక బాధితురాలు శనివారం ఉండి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉమ్మడి పశ్చిమ అభివృద్ధికి కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



కొయ్యలగూడెంలో సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

కొయ్యలగూడెం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. కొయ్యలగూడెంలోని ఎంపీపీ గంజిమాల రామారావు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి నివాసం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారన్నారు. విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపడం కోసం ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలలకు పక్కా భవనాలు నిర్మించడమే కాక అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. అంతేకాక జగనన్న విద్యా కానుక ద్వారా పుస్తకాలు, యూనిఫాం, బెల్టు, షూ అందజేస్తోందన్నారు. అలాగే జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన భోజనం అందిస్తోందన్నారు. విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాలకు ప్రతి సంవత్సరం అమ్మఒడి పథకం ద్వారా రూ.15వేల నగదును జమ చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానన్నారు. కొయ్యలగూడెం మండలం అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ పార్టీ నాయకులు మంతెన సోమరాజు, ఎంపీటీసీ సభ్యులు గంట శ్రీనివాసరావు, వార్డు మెంబర్ పూలపల్లి రవికుమార్, మట్ట శ్రీనివాస్‌రావు, చిటికెన నాగార్జున, మారిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలలో ఉద్యాన వర్సిటీకి మూడో స్థానం



మూడోస్థానంలో నిలిచిన ఉద్యాన వర్సిటీ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా క్లస్టర్ యూనివర్సిటీల ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆదికవి యూనివర్సిటీలో రెండో రోజుల పాటు నిర్వహించిన వివిధ క్రీడాంశాలలో వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ విశ్వవిద్యాలయం కాలేజీ ఆఫ్ హార్టీకల్చర్ మూడో స్థానంలో నిలిచింది. బాలబాలికలు 46 మంది వాలీబాల్, బాస్కెట్‌బాల్, చెస్ పోటీలలో పాల్గొని మూడోస్థానంలో బహుమతులు అందుకున్నారు. ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ టి.జానకీరామ్ మాట్లాడుతూ ఏపీ ఉన్నత విద్యా మండలి సూచనలు మేరకు క్లస్టర్ యూనివర్సిటీల పరిధిలో తొలిసారిగా నిర్వహించిన పోటీలలో వర్సిటీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను కనబర్చారన్నారు. విజేతలను అభినందించారు. డీన్ ఆఫ్ హార్టీకల్చర్ డాక్టర్ ఏఎస్ పద్మావతమ్మ, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ డీఆర్ సలోమి సునీత, రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, కాలేజీ అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ హార్టీకల్చర్ విద్యార్థులు చదువులలోనే కాక క్రీడలలో కూడా ప్రతిభ చూపారన్నారు.

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



ఆలయం తూర్పు వైపు జంటగోపురాల ప్రాంతంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వేలాది మంది భక్తులు సుదూర ప్రాంతాల నుంచి ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, తూర్పురాజగోపుర ప్రాంతాలతో పాటు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు అలరించాయి.

వామనావతారంలో జగన్నాథుడు



వామనావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం జగన్నాథస్వామి వారు వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఒక చేతిలో గొడుగు, మరో చేతిలో కమండలం, పాత్రను ధరించి బలిచక్రవర్తిని పాతాళంలోకి తొక్కివేస్తున్నట్లు ఉన్న ఈ అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. ఈనెల 29 వరకు జరగనున్న రథయాత్రల సందర్భంగా రోజుకో అలంకారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడిని అధిక సఖ్యంలో భక్తులు దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ఇన్చార్జి ఈఓ ఎం.విజయరాజు కోరారు.

క్లుప్తంగా

రామాలయ మరమ్మతు పనులను పర్యవేక్షించిన మంత్రి కారుమూరి



తణుకులో కాపుల రామాలయం మరమ్మతు పనులను వీక్షిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: తణుకు మునిసిపల్ కార్యాలయం సమీపంలోని కాపుల రామాలయం మరమ్మతు పనులను పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శనివారం పర్యవేక్షించారు. ఆలయానికి సంబంధించి మరమ్మతులను పూర్తి స్థాయిలో నిర్వహించాలని ఆలయ కమిటీ నాయకులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆలయ మరమ్మతులకు మంత్రి కారుమూరి తనవంతుగా రూ. 1.10 లక్షలు ఆలయ కమిటీ నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, వార్డు ఇన్‌చార్జ్ కోనా రమేష్, కొఠారు రామాంజనేయులు, గంజి సతీష్, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



ఈడూరు వరాల వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున సుప్రభాత సేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు జరిపి, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను చేశారు. పరిసర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

దూర ప్రాంత ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్, విశాఖపట్టణం వంటి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ ఇస్తున్నట్టు తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి చెప్పారు. ముందుగా రాను, పోను ప్రయాణానికి రిజర్వేషన్ చేయించుకుంటే చార్జీలో రాను 10 శాతం, పోను 10 శాతం రాయితీ కల్పిస్తున్నామని చెప్పారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పెన్షనర్లు ఈకేవైసీ తక్షణమే చేయించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బి.హరికుమార్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పెన్షనర్లు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బి.హరికుమార్ తెలిపారు. శనివారం పెన్షనర్ల కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ జూలై 31నాటికి ఫారం 16ను అందించాలని కోరారు. డీఆర్ బకాయిలు, పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగదు రహిత వైద్య సదుపాయం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీకే వీరారావు, గరికపాటి సుబ్రహ్మణ్యశర్మ, ముస్తాఫా, అర్జునరావు, కృష్ణకుమారి, భాషా, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి

తణుకు టౌన్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ వేల్పూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్ కోరారు. వేల్పూరులోని 3వ నెంబరు గ్రామ సచివాలయం పరిధిలోని వలంటీర్లకు గృహ సారథులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఈకార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. జగనన్న సురక్షకు సంబంధించిన అంశాలపై వలంటీర్లకు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పెంటపాడు మండలం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అలంపురం గ్రామంలో సమస్యలు తెలుసుకొంటున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ఆరోగ్యకరమైన వాతావరణంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం చిన తాడేపల్లి సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి, నూరు శాతం లబ్ధి చేకూరేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. గూడెం మండలంలో మూడు క్లస్టర్లుగా విభజించి, ఈ కార్యక్రమ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందన్నారు. వారంతా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారన్నారు. నేడు ప్రారంభించిన ఈ కార్యక్రమం వారం రోజుల పాటు జరుగుతుందని, ఎనిమిదవ రోజు క్లస్టర్ పరిధిలో ప్రజల అర్జీలను టోకెన్ల రూపంలో పరిష్కరిస్తారన్నారు. ఒక్క రూపాయి తీసుకోకుండా ధ్రువపత్రాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, సర్పంచ్ పిచ్చికల రాజారావు, ఎంపీటీసీ దూలపల్లి సత్తియ్య, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, నీలాద్రిపురం ఉప సర్పంచ్ మేణ్ణి రామారావు, జగ్గన్నపేట సర్పంచ్ ములకాల సూర్యారావు, మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో విశ్వనాథ్, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, ఏపీఎం జీవీకేడీ ఎం.లక్ష్మి, జగన్నాథపురం పంచాయతీ ఈఓ కె.శ్రీనివాసరెడ్డి, చినతాడేపల్లి సచివాలయ కార్యదర్శి బి.రమేష్, డీడీవో టి.రవిచంద్ర, వివిధ శాఖలకు చెందిన అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలి

పెంటపాడు: ప్రభుత్వ పథకాలు ప్రజలకు నూరుశాతం అందాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమని, వాటిని తక్షణం నెరవేర్చేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన పెంటపాడు మండలం అలంపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒంటిగాంధీ బొమ్మవద్ద బాల వినాయకుని ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన మట్లాడారు. సీఎం అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకం అందించేందుకు చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. ఏ పరిస్థితుల్లో అర్హులకు సంక్షేమ ఫలాలు దక్కాలన్న లక్ష్యంతో ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. దీని ద్వారా నూరశాతం పథకాలు ఇంటింటికి అందించే లక్ష్యంలో భాగంగా నెలరోజులపాటు అధికారులు, ప్రజాప్రతినిధుల ద్వారా చేపట్టబోయే ఈ కార్యక్రమం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో జీవీకే మల్లికార్జునరావు, సీజీసీ మెంబర్ కర్రి బాస్కరరావు, ఉద్యాన శాఖాధికారి దుర్గేష్, ఎంపీపీ దాసరి హైమావతి, పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, సొసైటీల అధ్యక్షుడు కొలనువాడ దత్తుడు, దేవ వెంకటరమణ, బూరాడ శ్రీనివాస్, పలు గ్రామాల సర్పంచ్‌లు పెన్నాడ సూరిబాబు, వాకా దుర్గాభవాని, సుబ్బారావు, కట్టా దానయ్య, గ్రామ పార్టీ నాయకులు రాపాక కుమారి, దేవదానం, బీరా వెంకటరత్నం, దెందుకూరి సూర్యనారాయణరాజు, కళ్లేపల్లి గాంధీరాజు, మట్టా సత్యనారాయణ, తాతారావు, మైలవరపు పెదబాబు, తహసిల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి జగనన్న సురక్ష

తాడేపల్లిగూడెం అర్బన్ : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగా ఇచ్చేందుకు ఇంటింటికి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టామని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. స్థానిక 1, 2, 3 వార్డుల్లో జగన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కొట్టు వార్డుల్లోని ఇంటింటికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను జగనన్న సురక్ష యాప్‌లో నమోదు చేయించారు. గడపగడపకు వెళ్లిన సమయంలో తనకు ఎదురైన అనుభవాలను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్ళగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు. చిన్నచిన్న సాంకేతిక కారణాలతో కొంతమంది అర్హత కలిగి ఉండి పథకాలు అందుకోలేక పోతున్నారన్నారు. ఈ సమస్యను గ్రహించి క్లస్టర్ పరిధిలోను వలంటీరు సచివాలయం కన్వీనర్లు, ఉద్యోగులు వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రజలతో మమేకమవుతారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎ దుర్గేష్, డీపీఓ ఎం శ్రీనివాస్, మునిసపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, అసిస్టెంట్ కమిషనర్ ఎ గోపాలరావు, హౌసింగ్ డీఇ ప్రసాద్, నాయకులు కర్రి భాస్కరరావు, మేడపాటి చెల్లారెడ్డి, కొలుకులూరి ధర్మరాజు, బోళెం రామలక్ష్మి, రమణ, పైబోయిన వైదేహి, పత్సమట్ల సావిత్రి, కవల నాగరాజు, తాళ్ళూరి మురళి, వలంటీర్లు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేలు చేశాం...మళ్లీ ఆశీర్వదించండి

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- 22వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



22వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : రాష్ట్రంలో సంక్షేమ పాలన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక 22 వార్డులో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హజరయ్యారు. వార్డులో గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ ఆర్థిక, కుల, జనన, వివాహ తదితర 11 రకాల ధ్రువపత్రాలను త్వరితగతిన అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నెలరోజుల పాటు నిర్వహిస్తారని పత్రాలు అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి అండగా నిలవాలనే ఉద్దేశ్యంతోనే పలు రకాల ప్రజాప్రయోజన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుందన్నారు. మళ్లీ ప్రజలను మోసం చేసి అధికారం చేజిక్కించుకొనేందుకు చంద్రబాబు కుట్రలు చేస్తున్నాడన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు స్క్రిప్టు రాసిచ్చి మాట్లాడిస్తున్నారని, ప్రజలు నమ్మవద్దని చెప్పారు. రాబోయే రోజుల్లో సంక్షేమ పాలన కోరుకునే ప్రజలందరూ మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిపాలన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, ఎసి గోపాలకృష్ణ, నాయకులు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, చిటికిన ప్రసాద్, దాసి బాబు, వట్టి బుజ్జి, మిద్దే ఆదినారాయణ, హరిదాసుల రవీంద్రకుమార్, బోళెం రామలక్ష్మి, బోణ విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 100 మంది చేరిక :

స్థానిక 22వార్డులోని ఇన్‌ఛార్జి చిటికన ప్రసాద్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలోకి 100 మంది చేరారు. వారిని పార్టీ కండువాలతో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో వైఎస్సార్‌సీపీ గెలుపొంది మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని, తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఎమ్మెల్యే తనను గెలిపించాలని అన్నారు. చిత్తశుద్ధితో సేవలందించిన ప్రతి ఒక్కరికీ పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



అత్తిలి మండలం ఆరవల్లిలో బాల్యవివాహాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అత్తిలి: బాల్య వివాహాలు అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని మంచిలి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి అన్నారు. అత్తిలి మండలం ఆరవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో బాల్య వివాహాలు వలన కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయన్నారు. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా స్వతంత్రంగా జీవించగల్గుతారన్నారు. 18 ఏళ్లు నిండకుండా వివాహం చేయడం వారి హక్కులను ఉల్లంఘించడమేనన్నారు. బాల్యవివాహాలు చేసుకున్నట్లుయితే వారికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి అనంతలక్ష్మి, మహిళా సంరక్షణ అధికారిణి లక్ష్మీకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, వివిఎల్ఎన్ కుమారి, నంది విజయ, టి వరలక్ష్మి, బాలికలు పాల్గొన్నారు.

సామాన్యులపై విద్యుత్ బిల్లుల భారం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు కర్రి నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యుత్ బిల్లుల సర్దుబాటు పేరుతో కేంద్ర ప్రభుత్వం దోపిడీ చేస్తుందని సీపీఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, గూడ్స్ షెడ్డు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డిలు విమర్శించారు. తాలూకా రైల్వే గూడ్స్ షెడ్డు వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం యూనియన్ అధ్యక్షులు సత్తి కోదండరామిరెడ్డి అధ్యక్షతన శనివారం యూనియన్ కార్యాలయంలో నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణ చట్టం వల్ల విద్యుత్ ఛార్జీలు బాగా పెరిగాయని, ట్రూ అప్, అదనపు లోడ్ అంటూ అనేక రకాలుగా ప్రజలపై భారాలు పడ్డాయన్నారు. నేడు అనేక విధాలుగా ప్రజల జేబులు ఖాళీ చేయడానికి ప్రధానంగా కేంద్రం ప్రభుత్వం మార్చిన చట్టాలు వల్లే ఈ దారుణాలు జరుగుతున్నాయని విమర్శించారు. నిత్యావసర వస్తువులు ధరలు పెరగడంతో కార్మికులతో పాటు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు సాయిరెడ్డి, ఎస్‌వీఎస్ రెడ్డి, నాని, నారాయణ, ఆంజనేయులు, సుబ్బిరెడ్డి, వెంకట్రావు, ఎ.కృష్ణ, వై.కృష్ణ, ఎం.పుత్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



తణుకులో మంత్రి కారుమూరిని సత్కరిస్తున్న రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘ నాయకులు

తణుకు అర్బన్: విజయవాడ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో వచ్చేనెల 23న నిర్వహించే రాష్ట్ర రేషన్ డీలర్ల మహాసభకు ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును రేషన్ డీలర్లు ఆహ్వానించారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకులు శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరిని కలిసి ఘనంగా సత్కరించి ఆహ్వానపత్రిక అందచేశారు. ఈ సందర్భంగా 9 అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. రేషన్ డీలర్ల సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషిచేస్తానని మంత్రి కారుమూరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మండాది వెంకట్రావు, రాష్ట్ర సలహాదారులు నరసింహమూర్తి, ఏలూరు జిల్లా అధ్యక్షులు తలారి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉదయేశ్వరరావు, తూర్పుగోదావరి జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్వరరావు, కోశాధికారి పృథ్వీరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్, విజయవాడ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్, సహాయ కార్యదర్శి ఉదయరవి, తణుకు మండల అధ్యక్షులు రవికుమార్, రమేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ

ఇరగవరం: మండలంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం సర్టిఫికెట్లను అందజేశారు. బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇరగవరం మండలం గోటేరు గ్రామంలో రెండు నెలల పాటు టైలరింగ్‌పై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధి అవకాశాలు, ముద్రలోన్ తదితర అంశాలపై బైర్రాజు ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసరాజు వివరించారు. టైలరింగ్ నేర్చుకోవడానికి మరో 30మంది మహిళలు ముందుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ ఆర్ శెట్టి, రామకృష్ణ, గ్రామ సర్పంచ్ బొక్కా లక్ష్మి, కన్వీనర్ పెన్మత్స రామభద్రరాజు, పీవీ సుబ్రహ్మణ్యరాజు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇతర రంగాల్లోనూ రాణించాలి

సాక్షి, భీమవరం: విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లో రాణించినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి నిర్వహించిన క్విజ్ పోటీల్లో బహుమతులు సాధించిన స్థానిక సీఎస్ఎన్ కళాశాల ఫార్మసీ విద్యార్థులు టి.శ్యాముల్, ఎస్.రాములు ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.రఘువీరవర్మ, వైస్ ప్రిన్సిపాల్ కె.దుర్గాప్రసాద్, గెద్దం భాస్కరరావు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు ఆపాలి

సాక్షి, భీమవరం: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను ఆపాలని దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశంచౌక్ సెంటర్లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న దాడుల నుంచి క్రైస్తవులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎండీ మునవర్, గంటా రాజ్‌కుమార్, ఆనంద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరంలో మంత్రి కారుమూరి పరామర్శలు



ఇరగవరంలో వైఎస్సార్‌సీపీ నాయకుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: ఇటీవల మృతిచెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. ఇరగవరం గ్రామానికి చెందిన గంధరపు రామకృష్ణ తండ్రి ఇటీవల మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. గంధరపు నాగేశ్వరరావు తల్లి ఇటీవల మృతిచెందడంతో కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. మంగెన తాతారావు తండ్రి మృతి చెందడంతో తాతారావు కుటుంబాన్ని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఎంపీటీసీలు ఎం రామానాయుడు, పి పాలేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు సిహెచ్ శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



కాళ్ల హైస్కూల్లో విద్యార్థులకు భోజనం వడ్డించి, రుచి చూస్తున్న జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణారావు

కాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం విద్య, నాడు-నేడు తో పాటు జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకానికి అత్యంత ప్రాముఖ్యతనిస్తుందని, విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసేలా చూడాలని ఎండీఎం/ఎస్ఎస్ జిల్లా కో ఆర్డినేటర్ కృష్ణారావు అన్నారు. మధ్యాహ్న భోజనం, పాఠశాల పారిశుద్ధ్యం నిర్వహణ పరిశీలన నిమిత్తం కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల , ప్రాథమిక ప్రాఠశాల (మెయిన్)ను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రాగి జావ, ఆకు కూర, అన్నం, తీపి పొంగలి, పప్పుచారు రుచి చూచి పిల్లలకు వడ్డించి వారితో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్దలో ఉన్న మోనూ పదార్థాల పోషక విలువలు తెలియజేసి పాఠశాలకు హాజరైన విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం చేసేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులను కోరారు. రికార్డులను, మరుగుదొడ్ల నిర్వహణ పరిశీలించి ఆయాలకు తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జె.లక్ష్మినారాయణ శాస్త్రి, ఎం.వి.సుందరమణి పాల్గొన్నారు.

జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయండి

తణుకు టౌన్: అగస్టు 7వ తేదీన తిరుపతిలో నిర్వహించే జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు చెప్పారు. శనివారం తణుకు లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. తిరుపతిలో నిర్వహించే మహాసభకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన బీసీ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈసమావేశాలకు అన్ని రాజకీయ పార్టీల నేతలకు, ముఖ్యమంత్రులను, నాయకులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దేశంలో చేపట్టే జన గణనలో బీసీ కులాల వారీగా చేపట్టాలని, అలా జరగకపోతే కేంద్రంలో అధికార బీజేపీకి బుద్ధి చెబుతామని పేర్కొన్నారు. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. మండల సిఫార్సులను అమలు చేయాలని కోరారు. చట్ట సభలలో బీసీలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు కడియాల సూర్యనారాయణ, జేవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గోటేరులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు



గోటేరులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇరగవరం: మండలంలోని గోటేరు గ్రామంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం కార్యక్రమం నిర్వహించారు. రేలంగి పీహెచ్‌సీ వైద్యులు బంగారు రవి సుమారు 89 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి బీపీ, షుగర్, జ్వరలు, వాతవరణం మార్పు వల్ల వచ్చే సీజనల్ వ్యాధులకు మందులు అందించారు. ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. గతంలో వైద్య సేవలు పొందాలి అంటే మండల కేంద్రం, పీహెచ్‌సీలకు లేదా ఎంపీలు, ప్రైవేట్ ఆసుపత్రులుకు వెళ్లాల్సి వచ్చేది ఇప్పుడు ఆ అవసరం లేకుండా వైద్యులే గ్రామాల్లోని వచ్చి ప్రజల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానం ఎంతగానో ఉపయోగ పడుతుందని, గ్రామాల్లోని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి ఇంద్రాణి, ఏఎన్‌యంలు, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

27న తణుకులో సాంఖ్యికోత్సవ్ - 2023

తణుకు టౌన్: ఈనెల 29న జాతీయ గణాంక శాస్త్ర దినోత్సవం సందర్భంగా ఈనెల 27వ తేదీన తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో సాంఖ్యికోత్సవ్ -2023 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి సాంఖ్యక శాస్త్ర విద్యార్థులందరూ ఆహ్వానితులేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాంఖ్యక శాస్త్రానికి సంబంధించి క్విజ్, పేపర్ ప్రజెంటేషన్, వంటి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.